క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన నేతలు



పలమనేరు: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని గురువారం తిరుపతిలో వైఎస్సార్ సీపీ పలమనేరు పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మంజునాథ రెడ్డి వున్నారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దపంజాణి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అప్పగించిన బోధనేతర పనులను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్లు మండల ఫ్యాప్టో నాయకులు తెలిపారు. వారు గురువారం ఎంఈవో-1 గోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న కర్మయోగి, విద్యాశక్తి, సాస, జీఎస్టీ ప్రచారం, మూల్యాంకన బుక్ లెట్స్, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర తదితర యాప్‌ల నిర్వహణ పెను భారంగా మారిందని తెలిపారు. తద్వారా పిల్లలకు సరైన విద్య అందించలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలని, ఉపాధ్యాయులను విద్య బోధించడం తప్పా ఇతర పనులకు ఉపయోగించరాదని డిమాండ్ చేశారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ షేక్ షావలి

సదుం: వాహన చోదకులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ షేక్ షావలి తెలిపారు. ఆయన గురువారం పీలేరు మార్గంలోని పుట్టావారిపల్లె బస్టాప్ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ తప్పక ధరించాలని సూచించారు.

ఆస్పత్రిలో ఆయుధ పూజ

సదుం: స్థానిక సీహెచ్‌సీలో గురువారం ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరికరాలకు పూజ చేశారు. మెడికల్ ఆఫీసరు ప్రసాదరాజు మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను ఎంపీడీవో రాధారాణి వివరించారు. ఇన్సూరెన్స్ పాలసీలపై పన్ను భారం తగ్గుతుందని తెలిపారు. ప్రపంచ దృష్టి దినోత్సవం పురస్కరించుకుని మెరుగైన కంటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్లు వివరించారు.

మృతునికి నివాళి



నారాయణప్ప మృతదేహంపై పూలమాలలు వేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట : మండలంలోని పెద్దబర్నిపల్లికి చెందిన నారాయణప్ప గురువారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు గ్రామానికి చేరుకున్నారు. నారాయణప్ప భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు మోహన్ రాజు, సురేష్ ఉన్నారు.

ఉపాధి హామీ వార్షిక ప్రణాళిక తయారీపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో బాలాజి

పెద్దపంజాణి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం వార్షిక ప్రణాళిక తయారీపై అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో బాలాజి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రతి ఏటా అక్టోబర్ 2న వార్షిక ప్రణాళిక తయారీ ప్రారంభమై నవంబరు 15న ముగుస్తుందన్నారు. ఈ ప్రణాళిక తయారీలో అందరు వేతనదారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందిని భాగస్వాములు చేయాలని సూచించారు. ప్రస్తుతం కేంద్రం సాఫ్ట్‌వేర్ యుక్త ద్వారా ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో వ్యక్తిగత, జీవన ఉపాధి పెంపొందించే పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీవో మురుగేషన్, ఏవో హేమలత, పశువైద్యాధికారిణి సరిత, ఏపీఎం నీరజ, ఎంఈవో గోపాల్ రెడ్డి, మండల సమైఖ్య అధ్యక్షురాలు సునంద పాల్గొన్నారు.

తమిళనాడు సరిహద్దు వరకు అడవిలో ఉన్న రహదారి



అక్రమాలకు అడ్డా
అరట్ల ఫారెస్ట్ రోడ్డు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలమనేరు నియోజకవర్గంలో అక్రమ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులకు బైరెడ్డిపల్లె మండలం నెల్లిపట్ల నుంచి తమిళనాడులోకి వెళ్లే అరట్ల అటవీ మార్గం రాచమార్గమైంది. ఈ రోడ్డు అడవి గుండా వెళుతుండడంతోపాటు తమిళనాడుకు అతి సమీపంలో వుండడం అక్రమార్కులకు బాగా కలిసి వచ్చింది. కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తమిళనాడులోకి, తమిళ బియ్యాన్ని కర్ణాటకలోకి తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. తాజాగా ఎర్రచందనం దుంగలు పట్టుబడడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

- కర్ణాటక, తమిళనాడులకు అడ్డదారి
- తమిళనాడుకు కర్ణాటక టెట్రా ప్యాకెట్ల సరఫరా
- కర్ణాటకకు తమిళనాడు బియ్యం రవాణా
- విచ్చలవిడిగా సారా తయారీ
- తాజాగా ఎర్రచందనం దుంగలు తరలింపు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గం తమిళనాడు, కర్ణాటకకు అతి సమీపంలో వుంది. కొన్ని కిలోమీటర్లు దాటితే కర్ణాటక, తమిళనాడులోకి సులభంగా చేరుకోవచ్చు. దీంతో కొంతమంది కూటమి నేతల అండతో అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారు. వీరికి బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల నుంచి తమిళనాడులోని అరట్ల అటవీ మార్గం బాగా కలిసి వచ్చింది. నెల్లిపట్ల నుంచి నాలుగు కిలోమీటర్లు దాకా తారురోడ్డు ఆపై కౌండిన్య అడవిలో 9 కిలోమీటర్లు వెళితే తమిళనాడులోకి, అక్కడికి వారు ఏపీలోకి సులభంగా చేరుకోవచ్చు. అటవీ మార్గం కావడంతో పోలీసులు పెద్దగా నిఘా పెట్టడం లేదు. దీంతో స్మగ్లర్లకు అనుకూలంగా మారింది.

కన్నడ మద్యం, తమిళ బియ్యం రవాణా

తమిళనాడులోని పేర్నాంబట్ మీదుగా అరట్ల వరకు వచ్చి ఆపై అడవి మార్గంలో మన రాష్ట్రంలోని నెల్లిపట్లకు చేరుకుంటే ఇక్కడి నుంచి కర్ణాటకకు 19 కిలోమీటర్లు మాత్రమే. ఈ క్రమంలో కొంతమంది కర్ణాటకలో టెట్రా ప్యాకెట్లు తీసుకుని ద్విచక్ర వాహనాలపై తమిళనాడుకు తరలిస్తున్నారు. తమిళనాడు నుంచి రేషన్ బియ్యాన్ని బైరెడ్డిపల్లి మండలం మీదుగా కర్ణాటకకు సులభంగా చేరవేస్తున్నారు. కొంతమంది స్మగ్లర్లతో రోజుకింత అని రేటు మాట్లాడుకుని వెళ్లేటప్పుడు టెట్రా ప్యాకెట్ కేసులు, వచ్చేటప్పుడు మూడు బస్తాల తమిళనాడు బియ్యాన్ని తీసుకువస్తున్నారు.

గుర్తుతెలియని శవాలు ఎన్నో..

గతంలో మణికంఠన్ శరవణన్ ముఠా గాంధీనగర్ వద్ద పలమనేరు పోలీసులను హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ ముఠా బోయకొండలో ఒక వ్యక్తిని హత్య చేసి అరట్ల అటవీ ప్రాంతంలో పాతిపెట్టారు. ఈ క్రమంలో ఈ రోడ్డు గుండా వెళ్లడానికి ఎవరూ సాహసం చేయడం లేదు. దానికితోడు ఇది కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీ కావడంతో ఏనుగులు ఉంటాయన్న భయం కూడా వుంది. దీన్ని ఆసరాగా చేసుకున్న స్మగ్లర్లు అక్రమ రవాణాతోపాటు అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగిస్తున్నారు.

ఎర్రచందనం దుంగలు సైతం తరలింపు

ఈ మార్గంలోని తమిళనాడు సరిహద్దులో వున్న అడవిలో ఒక ముఠా సారాను తయారు చేస్తోంది. ఇప్పటికే ఇక్కడి ఎక్సైజ్, ఫారెస్ట్, పోలీసు అధికారులు పలుమార్లు దాడులు చేశారు. అయినా నాటు సారా తయారీ ఆగలేదు. అక్కడి స్మగ్లర్ల వద్ద నాటు తుపాకులు, పెద్ద సంఖ్యలో కూలీలు వుండడం, లోయలు పెద్దగా ఉండడంతో కొండ పైనుంచి ఎవరు వచ్చినా తప్పించుకుంటూ వున్నారు.

వెలుగులోకి వచ్చిందిలా..

ములకలచెరువులో కల్తీ మద్యం దందా వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఏపీ పోలీసులు అరట్ల మార్గంలో తనిఖీలు చేపట్టారు. దీంతో అక్కడ రెండు ఎర్రచందనం దుంగలు లభించాయి. పలమనేరు ఫారెస్ట్ అధికారులతో కలిసి కూంబింగ్ చేయగా తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. అదేవిధంగా కర్ణాటక నుంచి తమిళనాడుకు కారులో తరలిస్తున్న రూ.90 వేల విలువైన టెట్రా ప్యాకెట్ కేసులను సీజ్ చేశారు. ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు.



ఏపీలోని నెల్లిపట్ల నుంచి తమిళనాడులోని అరట్లకు వెళ్లే అటవీ రోడ్డు

రోడ్డుపైనే ఆగిపోయిన ఆర్టీసీ బస్సు



రోడ్డు మీద అగిపోయిన ఆర్టీసీ బస్సు

రొంపిచెర్ల: హిందూపురం డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు గురువారం రొంపిచెర్ల మండలం బండకిందపల్లె పంచాయతీ బడబళ్లవంక సమీపంలో ఆగిపోయింది. డ్రైవర్ స్టార్ట్ చేయడానికి ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు. చివరికి ఇంజిన్‌లోని బెల్ట్ తెగిపోయినట్టు గుర్తించాడు. దీంతో చేసేదేమీ లేక ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించి పంపారు. గతంలో పీలేరు, మదనపల్లె, తిరుపతి, రాయచోటి డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు ఆగిపోయాయి. కాలం చెల్లడంతోనే బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయని, కండీషన్ వున్న బస్సులను నడపాలని ప్రజలు కోరుతున్నారు.

సింగిరిగుంట సచివాలయంలో చోరీ

పుంగనూరు: మండలంలోని సింగిరిగుంట సచివాలయంలో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. గురువారం ఉదయం సచివాలయం తాళాలు తీసి ఉండడాన్ని సిబ్బంది గుర్తించారు. లోపల పరిశీలించగా బ్యాటరీలు, టివి, కరెంటు మోటారు తదితర వస్తువులను చోరీకి గురైనట్టు గుర్తించి పంచాయతీ సెక్రటరీ సుధారాణికి సమాచారం అందించారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలిసిన వెంటనే ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల సంజీవనిని సద్వినియోగం చేసుకోండి



రొంపిచెర్ల బాల సంజీవని కిట్లపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శిరీష



బైరెడ్డిపల్లె : గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న మహతి ఫౌండేషన్ ప్రతినిధులు

రొంపిచెర్ల: గర్భిణులు, బాలింతలు బాల సంజీవని కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష తెలిపారు. ఆమె గురువారం మల్లెలకస్పా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల సంజీవని కిట్లలో రెండు కిలోల రాగి పిండి, కిలో అటుకులు, 250 గ్రాముల బెల్లం, ఎండు ఖర్జూరం, వేరుశనగ చిక్కీలు అందజేస్తామని తెలిపారు. అలాగే బియ్యం, కందిపప్పు, నూనె, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు ఇస్తామని తెలిపారు. వీటిని తినడం వలన ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గౌరీ, లలిత, హెల్పర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బైరెడ్డిపల్లె : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర తెలిపారు. ఆయన గురువారం మహతీ ఫౌండేషన్ సహకారంతో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కూరగాయలు, పండ్లు, గుడ్లు తినాలన్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సేవలు



బస్టాండ్‌లో ప్రయాణికుల వివరాల చార్ట్‌ను పరిశీలిస్తున్న ఎండీ ద్వారక తిరుమలరావు

పుంగనూరు: గ్రామీణ స్థాయి నుంచి ఆర్టీసీ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు తెలిపారు. ఆయన గురువారం పుంగనూరు ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ప్రయాణికులు, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ప్రయాణాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే స్థానిక ప్రజల కోరిక మేరకు పుంగనూరు నుంచి బెంగళూరుకు మరో రెండు సర్వీసులు నడుపుతామన్నారు. రాత్రిపూట మదనపల్లె సర్వీసులు పుంగనూరు పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డులో చిత్తూరుకు వెళ్తున్నట్టు అందని ఫిర్యాదుపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మద్యం మాఫియాను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు

పుంగనూరు: రాష్ట్రంలో కల్తీ మద్యం విక్రయిస్తున్న మాఫియాను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు డిమాండ్ చేశారు. ఆయన గురువారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఎస్సీ, ఎస్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యం తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎంఎస్ఎంఈలలో పేదలకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్‌మునీంద్ర నాయక్, చెన్నరాయుడు, కృపాకర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా ఆగిన మండల సమావేశం

- 72 గంటల్లో బిల్లులు పెట్టాలి
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజు

వి.కోట: తాముచేసిన పనులకు సంబంధించిన బిల్లులను 72 గంటల్లో మంజూరు చేస్తేనే మండల సర్వసభ్య సమావేశానికి హాజరవుతామని పలువురు సర్పంచులు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోగురువారం ఎంపీపీ యువరాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 18 పంచాయతీల్లో సర్పంచులు వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమచేసిందని తెలిపారు. ఈ క్రమంలో బిల్లులు మంజూరు చేయాలని పంచాయతీ కార్యదర్శులను అడిగితే కూటమి నేతలు చెబితేనే బిల్లులు పెడతామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులను కాదని కూటమి నేతలకు విలువ ఇవ్వడం దారుణమని వాపోయారు. సభ ముందుకు సాగాలంటే మూడు రోజుల్లో బిల్లులు పెట్టాలని స్పష్టం చేశారు. అధికార పార్టీ నేత చెబితేనే బిల్లులు పెడతానని చింతమాకులపల్లి పంచాయతీ కార్యదర్శి చెప్పడంపై మండిపడ్డారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను కార్యదర్శులు 100 శాతం పెట్టాలని ఆదేశించారు. బిల్లులు పెట్టని వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అధికారుల తీరులో మార్పు రాకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మండలంలోని కడతనాయనపల్లి వద్ద వాగు భూమిలో వున్న దారికి అడ్డంగా కూటమి నాయకులు కంచె వేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అధికార బలంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశం రసాభాసగా మారడంతో అర్ధంతరంగా ముగిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటేశ్వరావు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ జ్ఞాన శేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

14న జాబ్ మేళా

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద గల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. 9 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వెల్లడించారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివిన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పలమనేరు పరిరక్షణ సమితి నిర్వాహకులు గురువారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని సన్మానించారు. ఇందులో పీపీఎస్ నిర్వాహకులు నరసింహులు, సీతారామయ్య, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

పెద్దపంజాణి: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాగులు, వంకలు, చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా చూడాలని ఎంపీడీవో బాలాజి తెలిపారు. ఆయన గురువారం ఎంఈవో గోపాల్‌రెడ్డితో కలిసి పాఠశాలల హెచ్ఎంలతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల పరిసరాల్లో నాసిరకం తినుబండారాల అమ్మకాలను నివారించాలని తెలిపారు. నిర్మాణాలు జరుగుతుంటే ప్రమాదాలు జరగకుండా రెడ్ రిబ్బన్ ఏర్పాటు చేయాలన్నారు.

సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి దారుణం

చౌడేపల్లె: సుప్రీం కోర్టులో చీఫ్ జస్టిస్‌పై న్యాయవాది దాడికి యత్నించడం దారుణమని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చంద్ర, బ్యాంకు రెడ్డెప్ప, కృష్ణమూర్తి తెలిపారు. వారు గురువారం కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వాసు, శేఖర్, తదితరులతో కలిసి బస్టాండులో నిరసన తెలిపారు. న్యాయవాదిపై రాజద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

పలమనేరు: ఆడ పిల్ల తన గురించి తాను తెలుసుకోవాలని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్‌బాబు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. పట్టణ సమీపంలోని గురుకుల పాఠశాలలో గురువారం ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై టీచర్లు పిల్లలకు తెలియజేయాలని సూచించారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు



పలమనేరు: పట్టణంలోని పలు లాడ్జీల్లో గురువారం పోలీసులు తనిఖీలు చేశారు. తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కొత్త వ్యక్తులు గదులు కావాలని అడిగితే ఆధార్‌ను తీసుకోవాలని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



ద్వారకనాథరెడ్డితో పలమనేరు న్యాయవాదులు

పలమనేరు: న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక బార్ కౌన్సిల్ సభ్యులు కోరారు. వారు గురువారం రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకనాథరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, వెల్ఫేర్ ఫండ్ మంజూరు చేయాలని కోరారు.

రాష్ట్ర కార్యదర్శులకు సత్కారం



రాష్ట్ర కార్యదర్శులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

బైరెడ్డిపల్లె : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బైరెడ్డిపల్లె ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా దయానందగౌడును నియమించింది. ఈ క్రమంలో వారిని స్థానిక పార్టీ నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు.

డివిజన్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



సదుం: పోటీలకు హాజరైన విద్యార్థులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం డివిజన్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్ -14, 17 విభాగాల్లో విద్యార్థులకు 40 అంశాల్లో పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎం సుబ్రమణ్యం తెలిపారు. 300 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. ఇందులో ప్రథమ, ద్వితీయ స్థానానికి ఎంపికయిన వారు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు హాజరవుతారని వివరించారు. డివిజన్ కో-ఆర్డినేటరు శశిప్రకాశ్, పీఈటీ, పీడీ అసోసియేషన్ సెక్రటరీ నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో జ్ఞానవి, జ్యోత్స్న ప్రతిభ



విద్యార్థులు జ్ఞానవి, జ్యోత్స్న

పుంగనూరు: సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పలమనేరు డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకి చెందిన జ్ఞానవి షార్‌పుట్, డిస్కత్రోలో ప్రథమ, జ్యోత్స్న ద్వితీయ స్థానంలో నిలిచినట్టు పీడీ మురళీధర్ తెలిపారు. వారిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జిల్లా పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థుల హవా

గడుపల్లె: ఈ నెల 7న గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్ -19 పరుగు పందెం పోటీల్లో గుడుపల్లె ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్టు ప్రిన్సిపాల్ హరణి తెలిపారు. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వి.స్నేహ 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, వి.కావ్య డిస్కస్‌త్రోలో మొదటి స్థానం, టి.బేబిప్రియ ట్రిపుల్ జంప్, జావలిన్ త్రోలో ద్వితీయ స్థానం, బి.చాందిని 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్టు వెల్లడించారు. వారిని అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ పీ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్య పఠనం పోటీలు

పలమనేరు: పాఠశాల స్థాయి విద్యార్థులకు పద్య పఠనం పోటీలు నిర్వహిస్తున్నట్టు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకుడు తులసీనాథం నాయుడు తెలిపారు. సమితి వార్షికోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు ఈ నెల 16వ తేదీలోపు 9553429770 నంబరుకు కాల్ వేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

పుంగనూరు: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం విశేష సేవలు అందించిన వ్యక్తి కాన్షీరామ్ అని దళిత నాయకులు జెవి.నాగరాజు తెలిపారు. పుంగనూరులో గురువారం కాన్షీరామ్ జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రమణ, సుబ్రమణ్యం, ఆంజప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.